నమస్తే తెలంగాణ
మెదక్
13 | హైదరాబాద్, బుధవారం 28 ఫిబ్రవరి 2024 | MEDAK

## కాంగ్రెస్, బీజేపీ..
# డిష్యుం డిష్యుం

- ఉద్రిక్తతల మధ్య సాగిన బండి సంజయ్ ప్రజాహిత యాత్ర
- హుస్నాబాద్ మండలం రాములపల్లిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య బాహాబాహీ
- దిష్టిబొమ్మల దహనం... బండి గోబ్యాక్, పాన్నం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు
- పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు
- నే నెవరిపై వ్యక్తిగత ఆరోపణలు చేయలేదు.. తనకు ఆపాదించుకొని పాన్నం హింసను ప్రేరేపిస్తున్నాడు
- ఆరు గ్యారెంటీలపై ప్రజలను పక్కతోవ పట్టించేందుకే కాంగ్రెస్ పార్టీ రచ్చ చేస్తోంది
- హుస్నాబాద్ రోడ్‌షోలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

రాములపల్లిలో ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు, అడ్డుకుంటున్న పోలీసులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ చేపట్టిన రెండో విడత ప్రజాహిత యాత్ర ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. బండి సంజయ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఒకరిపై ఒకరు చేసుకున్న ఆరోపణలతో రెచ్చిపోయిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బాహాబాహీకి దిగడంతో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం రాములపల్లిలో మంగళవారం ప్రారంభమైన యాత్ర ఉద్రిక్తతలకు దారితీసి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. కాంగ్రెస్ కార్యకర్తలు బండి సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. బీజేపీ ఫ్లెక్సీలను ధ్వంసం చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. అయోధ్యలోనే రాముడు పుట్టాడనే గ్యారెంటీ ఏమిటని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నిస్తుండగా, ఇలా అనే వారు వారి తల్లికే పుట్టారనే గ్యారెంటీ ఏమిటి...? అని బండి సంజయ్ సోమవారం ప్రజాహిత యాత్రలో అన్న వ్యాఖ్యలు దుమారం లేపాయి. మంత్రి పొన్నంను అన్నాడని, పొన్నం తల్లిని అవమానించారని కాంగ్రెస్ వర్గాలు ఆందోళనకు దిగాయి. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి గ్రామంలో సోమవారం రాత్రి బసచేసిన ఓ పాఠశాలపై దాడి చేసేందుకు హుస్నాబాద్ తదితర ప్రాంతాల నుంచి మంగళవారం ఉదయం కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వీరిని పోలీసు అడ్డుకుని అరెస్టు చేశారు. అనంతరం హుస్నాబాద్ మండలం రాములపల్లికి బండి సంజయ్ యాత్ర చేరుకోవడంతో అక్కడే ఉన్న మరికొందరు కాంగ్రెస్ నాయకులు బండి గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. యాత్రను అడ్డుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలపై బీజేపీ కార్యకర్తలు దాడికి దిగడంతో మోహన్ అనే కార్యకర్తకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం మహ్మదాపూర్, నాగారం, పోతారం(ఎస్), హుస్నాబాద్, పందిల్ల, అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి, రామవరం, అక్కన్నపేట, కట్కూరు గ్రామాల ద్వారా హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండకు యాత్ర చేరుకుంది. పోలీసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఎలాంటి అవాంతరాలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాములపల్లిలో బండి సంజయ్ దిష్టిబొమ్మను, ఫ్లెక్సీలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో రోడ్‌షోలో మాట్లాడుతున్న బండి సంజయ్

### మంత్రి పాన్నం హింసను ప్రేరేపిస్తున్నడు
**– కరీంనగర్ బీజేపీ ఎంపీ బండి సంజయ్**

తానెవరిపై వ్యక్తిగత ఆరోపణలు చేయలేదని, తాను చేసిన వ్యాఖ్యను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆపాదించుకొని కార్యకర్తలను రెచ్చగొట్టి హింసను ప్రేరేపిస్తున్నాడని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. మంగళవారం ఆయన చేపట్టిన ప్రజాహిత యాత్ర హుస్నాబాద్ పట్టణానికి చేరుకోగా అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడారు. తల్లి ఎవరికైనా తల్లేనని, తల్లిని అవమానపర్చే విధంగా మాట్లాడే సంస్కార హీనుడిని కాదని అన్నారు. అయోధ్య రామాలయం, రాముడి గురించి మాట్లాడిన వారిని అన్న మాటలను తననే అన్నట్లు సృష్టించుకొని ఈ వంకతో రాష్ట్రంలో సంచలనం సృష్టించాలని పొన్నం ప్రభాకర్ కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు. ఇతడి వ్యవహారం చూస్తే సీఎం రేవంత్‌రెడ్డి పదవికే ఎసరు తెచ్చేలా కనిస్తోందని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ మంత్రులు కుట్రలు చేస్తున్నారని, ఆరుకు ఆరు గ్యారెంటీలను చెప్పిన సమయంలోపు అమలు చేయకుంటే ప్రజలతో కలిసి బీజేపీ చేబోయే ఉద్యమాలకు కాంగ్రెస్ పార్టీ తట్టుకోదన్నారు. కరీంనగర్ ఎంపీగా హుస్నాబాద్ నియోజకవర్గానికి రూ.698 కోట్ల నిధులు తెచ్చామని, ఇందుకు బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. దమ్ముంటే కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో తనను ఓడించాలని, ఓడిపోతే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. ఒక వేళ కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోతే పొన్నం ప్రభాకర్ తన పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటాడా అని సవాల్ విసిరారు. ఎంపీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ అనేక కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, రాష్ట్ర నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, స్థానిక నాయకులు లక్కిరెడ్డి తిరుమల, రాజేంద్రప్రసాద్, దొడ్డి శ్రీనివాస్, బొమ్మగాని సతీశ్, వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ బల్దియా బడ్జెట్ రూ. 50.90 కోట్లు

**2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏకగ్రీవంగా ఆమోదం**

**ఎమ్మెల్యే, కౌన్సిలర్ మధ్య వాదోపవాదాలు**

మెదక్ బల్దియా బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 27: మెదక్ మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం రసాభసగా మారింది. ఎమ్మెల్యే, కౌన్సిలర్ మధ్య వాదోపవాదాలతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. మెదక్ మున్సిపల్ వార్షిక బడ్జెట్ సమావేశం చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 50.90 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను మున్సిపల్ పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా బడ్జెట్‌పై చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. పట్టణాభివృద్ధికి నిధులు అవసరం ఉన్నాయని, ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెదక్ ప్రజలు తనను ప్రేమతో గెలిపించుకున్నారని, పట్టణాభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని, త్వరలోనే పట్టణంలోని చౌరస్తాల సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్మన్ కోరడం సబబైనా, 20 ఏండ్లుగా ఆస్తి పన్ను చెల్లించని దుకాణాలను మున్సిపల్ అధికారులు సీజ్ చేస్తే చైర్మన్ అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పన్నులు చెల్లిస్తేనే మున్సిపల్‌కు ఆదాయం చేకూరడంతోపాటు పట్టణం అభివృద్ధి చెందుతుందని హితవు పలికారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభుత్వం సాధ్యం కాని హామీలు ఇస్తున్నదని, పాత పనుల బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదంటూ ప్రస్తావించారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి.. కొత్త ప్రభుత్వం వచ్చి కేవలం రెండు నెలలు మాత్రమే అయ్యిందని, గత ప్రభుత్వంలోని అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయన్నారు. దళితబంధు పథకం ద్వారా దళితులందరికీ లబ్ధి చేకూరలేదని ఎమ్మెల్యే ప్రస్తావించగా, 5వ వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు జోక్యం చేసుకుని రాష్ట్ర బడ్జెట్ కాదు మున్సిపల్ బడ్జెట్‌లో మున్సిపల్‌కు సంబంధించిన విషయాలే మాట్లాడాలని సూచించారు. దీంతో ఎమ్మెల్యే కౌన్సిలర్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఎమ్మెల్యేను బడ్జెట్ సమావేశానికి ఆహ్వానించి అవమానిస్తారా అంటూ ఆంజనేయులుపై కాంగ్రెస్ కౌన్సిలర్లు మండిపడ్డారు. అనంతరం అనంతరం అకౌంటెంట్ ఆదాయ, వ్యయాలను గౌరవ సభ్యులకు వివరించారు. 2024-25కు 50.91 కోట్ల ఆదాయం వస్తుండగా.. ఖర్చులు రూ.50.89 కోట్లు అవుతున్నట్లు బడ్జెట్‌లో చూపారు. ఇందులో గతేడాదితో పోలిస్తే రూ.17 కోట్ల ఆదాయం పెరిగినట్లు తెలుస్తోంది. ఖర్చులు సైతం అదేవిధంగా పెరుగుతున్నట్లు లెక్కల్లో తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, కమిషనర్ జానకిరామ్ సాగర్, డీఈ మహేశ్, టీపీవో భూపతి కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ గౌడ్, శేఖర్, జయరాజ్, సుంకయ్య, కిశోర్, సమీయొద్దీన్, విశ్వం, లలిత, కల్యాణి, మేఘమాల, జయశ్రీ, వేదవతి, చందన, శేకమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక మున్సిపల్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# దుబ్బాకను అగ్రగామిగా నిలుపుదాం

**ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక, ఫిబ్రవరి 27 : పచ్చదనం, అభివృద్ధిలో దుబ్బాక మున్సిపాలిటీని అగ్రగామిగా నిలిపేందుకు రాజకీయాలకు అతీతంగా మున్సిపల్ పాలక వర్గంతో పాటు అధికారులు కృషి చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో 2024-25 బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అధ్యక్షతనలో నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేశ్ 2024-25 అంచనా బడ్జెట్ ఎజెండా వివరాలను వివరించి రూ.19.40 కోట్లతో అంచనా బడ్జెట్‌ను కమిషనర్ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... కొత్తగా ఏర్పడిన దుబ్బాక మున్సిపాలిటీని మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సి ఉందని, టీయూఎఫ్ఐడీసీ నిధులతో ముందుగా ఆడిటోరియం, వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ భవనాలను నిర్మాణం చేపట్టాలని సూచించారు. పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలన్నారు. పట్టణానికి రింగ్ రోడ్డు నిర్మాణం చాలా అవసరమని, వాటికి సంబంధించిన సర్వే పనులు జరిగాయని, జంగిల్ కటింగ్ పనులకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సూచించారు. సీసీ, మురుగు కాల్వలు కాకుండా పట్టణంలో ప్రధాన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. మున్సిపల్‌లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవన్నారు. తాను ప్రతి సమావేశానికి హాజరవుతానని, ప్రతి వోచర్‌ను పరిశీలిస్తామని తెలిపారు. లచ్చపేటలో డంప్‌యార్డు త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. చెల్లాపూర్‌లో స్టేడియం కోసం ప్రభుత్వానికి అప్పగించిన 5 ఎకరాల స్థలాన్ని మున్సిపల్ ఆధీనంలోకి తీసుకోవాలని, మరో 5 ఎకరాల అసైన్డ్ భూమిని రైతులకు ధాన్యం ఆరబోసేందుకు వసతి కల్పించేందుకు తీసుకోవాలన్నారు. దుబ్బాకలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు అర్హులకు కేటాయించి, ధ్రువపత్రాలు అందించాలన్నారు. పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రూ.18 లక్షలు వేతనాలను మూడు రోజుల్లో అందించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. దుబ్బాక మున్సిపల్ అభివృద్ధికి తనవంతుగా మరిన్ని నిధులు తెచ్చేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

### దుబ్బాకలో ఒకేచోటకు ప్రభుత్వ పాఠశాలలు

దుబ్బాకలో అద్భుతంగా నిర్మించిన కేసీఆర్ బడిలో ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ కళాశాల వరకు కొనసాగించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. దుబ్బాక పట్టణంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల వివరాలు, జూనియర్ , డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సంఖ్య , తదితర వాటిపై ఎంఈవో ప్రభుదాస్, ప్రిన్సిపాళ్లతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దుబ్బాకలో కేసీఆర్ బడిలో 56 తరగతి గదులు ఉండగా, ఇందులో ప్రస్తుతం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల మాత్రమే కొనసాగుతున్నాయని తెలిపారు. దీనిని పూర్తిగా వినియోగించేందుకు ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ వరకు ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు దృష్టి సారించినట్లు తెలిపారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

దుబ్బాకలో గాజుల నరేశ్‌కు చెందిన ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నరేశ్‌ను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణాబాలకిషన్‌గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు ఉన్నారు.

## రాముడి పేరుతో 'బండి' రాజకీయాలు
**హుస్నాబాద్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: ఐదేండ్లు కరీంనగర్ ఎంపీగా ఉండి బండి సంజయ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదని, ఎన్నికల్లో గెలవాలని ఇప్పుడు రాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్నాడని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మంత్రి మాట్లాడారు. రాజకీయంగా బండి సంజయ్‌ను తాను ప్రశ్నిస్తే, అతడు తనకు జన్మనిచ్చిన తల్లిని కించపరుస్తూ మాట్లాడడం బాధాకరమన్నారు. శ్రీరాముడు అంటే అందరికీ గౌరవం ఉందని, రాముడి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు తల్లి గురించి, జన్మల గురించి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. నాలుక, ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడితే బాగుంటుందని, లేకుంటే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని బండి సంజయ్‌కు మంత్రి పొన్నం హెచ్చరించారు.

# బ్రాహ్మణపల్లిలో పారిశుధ్యం

**నమస్తే తెలంగాణ కథనానికి స్పందన**

**చెత్తా చెదారం తొలిగింపు, కాల్వలు శుభ్రం**

**పంచాయతీ ట్రాక్టర్ మరమ్మతుకు చర్యలు**

నర్సాపూర్, ఫిబ్రవరి 27: 'పడకేసిన పల్లె ప్రగతి' పేరుతో సోమవారం నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో పాడైన గ్రామపంచాయతీ ట్రాక్టర్, పారిశుధ్యం లోపంపై వార్త వచ్చింది. దీంతో అధికారులు మంగళవారం అచ్చంపేట్, గొల్లపల్లి, నారాయణపూర్, లింగాపూర్ నుంచి గ్రామపంచాయతీ ట్రాక్టర్లు, ట్రాలీలు, పారిశుధ్య కార్మికులను బ్రాహ్మణపల్లికి తీసుకువచ్చి గ్రామంలోని చెత్తాచెదారాన్ని తొలిగించి, మురుగు కాల్వల నుంచి వ్యర్థాలను తీసివేశారు. పాడైన ట్రాక్టర్ గురించి ఎంపీవో వైద్య శ్రీనివాస్‌ను వివరణ కోరగా డీపీఆర్‌వో, డీఎల్‌పీవో ఆదేశాల మేరకు ట్రాక్టర్ మరమ్మతుకు సంబంధించి కొటేషన్‌ను ప్రత్యేకాధికారి(తహసీల్దార్)కు అందించామని, దానికి అప్రూవల్ వెంటనే లభించిందని వెల్లడించారు. త్వరలోనే ట్రాక్టర్‌ను మరమ్మతు చేయించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేలా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అధికారులకు, నమస్తే తెలంగాణకు ధన్యవాదాలు తెలిపారు.

బ్రాహ్మణపల్లి గ్రామంలో ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తున్న పారిశుధ్య కార్మికులు, నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనం

# 'కాంగ్రెస్‌ను తరిమికొడదాం'

రామాయంపేట, ఫిబ్రవరి 27: గత ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీని ప్రజలెవ్వరూ నమ్మరని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం రామాయంపేటలో నిర్వహించిన బీజేపీ విజయ సంకల్పయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలను ఆరు గ్యారంటీల పేరుతో బురిడీ కొట్టించి, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డికి పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లడిగే హక్కులేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే ప్రజల్లోకి రావాలని సూచించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేడు మాటమార్చి కాలయాపన చేయడం కాంగ్రెస్‌కే చెల్లిందన్నారు. పింఛన్లు, ఉద్యోగులకు సకాలంలో జీతాలందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమాదేవి, రాష్ట్ర నాయకుడు గురువారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నిజాంపేట జడ్పీటీసీ పంజ విజయ్‌కుమార్, నందారెడ్డి, వెల్ముల సిద్దిరాములు, నవాత్ రాజేంద్ర ప్రసాద్, పట్టణాధ్యక్షుడు శంకర్‌గౌడ్, కొడపర్తి నరేందర్, రమేశ్, చింతల శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, ఆకుల రమేశ్, దయానందరెడ్డి, దిలీప్‌కుమార్, భాను చందర్, కార్తీక్ పాల్గొన్నారు.

రామాయంపేట విజయ సంకల్పయాత్రలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

# యువత నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

**మెదక్ కలెక్టర్ రాజర్షి షా**

మెదక్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో వారు పూర్తి సామర్థ్యాన్ని గ్రహించడంతోపాటు దేశ నిర్మాణంలో పాలుపంచుకునేందుకు నెహ్రూ యువ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం మెదక్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ (NYLP) 2024 కార్యక్రమాన్ని పట్టణంలోని వైస్రాయ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ భారత రాజ్యాంగం, చట్టాలపై మెరుగైన జ్ఞానం, అవగాహన, ప్రపంచవ్యాప్తంగా జాతీయ యువజన పార్లమెంట్లు క్రియాశీల-పౌరసత్వాన్ని ప్రోత్సహించడానికి విశ్వసనీయ యంత్రాంగాలుగా ఉద్భవించాయని తెలిపారు. యువత పార్లమెంటరీల నిర్మాణం, కూర్పు, నిర్వహణ విధానాల్లో తేడాలు ఉన్నప్పటికీ, యువతకు నిర్దిష్టమైన యువత సంబంధిత సమస్యలు, ముఖ్యంగా జాతీయ ప్రాముఖ్యత ఉన్న విషయాలపై వారి దృక్కోణాలను పంచుకోవడానికి ఆందోళనలను వ్యక్తీకరించడానికి వేదికలను అందిస్తుందన్నారు. రాష్ట్ర స్థాయి జాతీ య యువ పార్లమెంట్ ఫెస్టివల్‌లో తెలంగాణ నుంచి ద్వితీయ స్థానం గెలుపొందిన కుమారి నివేదితను కలెక్టర్ రాజర్షి షా ప్రశంసించి సన్మానించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చుతున్న వివిధ విధానాలు, సంస్కరణలు, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా యువజన శాఖ అధికారి రంజిత్ రెడ్డి, జడ్పీసీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీఏ శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ శ్రీహరి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కృష్ణమూర్తి, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్ నాగరాజు, జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ, ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, ఏఆర్ఈఎస్ ఎన్జీవో సునీత, సఖి వన్ స్టాప్ సెంటర్ రేణుక, ప్రొఫెసర్ వెంకటేశం, ప్రొఫెసర్ శరత్ రెడ్డి, ఎన్‌సీసీ ఏఎన్‌వో సుధాకర్, యువజన సంఘం అధ్యక్షుడు అధికం రాజు గౌడ్, ఎన్‌వైకే వలంటీర్లు సాయిరాం, చరణ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా

**నేటి నుంచి బగలాముఖి ఆలయ ప్రథమ వార్షికోత్సవం**

బగలాముఖి శక్తిపీఠం అమ్మవారు

శివ్వంపేట, ఫిబ్రవరి 27 : దేశంలోని అత్యంత శక్తివంతమైన పీఠాల్లో ఒకటైన బగలాముఖి శక్తిపీఠం ప్రథమ వార్షికోత్సవాన్ని బుధ, గురువారాల్లో రెండు రోజులపాటు శివ్వంపేటలో ఆలయ ఉపాసకులు బ్రహ్మశ్రీ శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు శక్తిపీఠం ట్రస్టు సభ్యుడు శివకుమార్‌గౌడ్, జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా తెలిపారు. మొదటిరోజు ఉద యం జ్యోతి ప్రజ్వలన, గోపూజ, గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రధాన దేవ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, లక్ష హరిద్రార్చన, మహామంగళ నీరాజనం, అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకీసేవ జరుగుతాయన్నారు. రెండోరోజు 108 కలశస్థాపన, కలశ జలాలతో మహాభిషేకం, సహస్ర పుష్పసహిత హరిద్రార్చన, పూర్ణాహుతి, మహామంగళనీరాజనం, భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులంతా అమ్మవారి పూజా కార్యక్రమాల్లో పాల్గొని అనుగ్రహం పొందాలని కోరారు.

**అందోల్ మండలం మసాన్‌పల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం**

**ముగ్గురు మృతి.. ముగ్గురికి గాయాలు**

ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

# దూసుకొచ్చిన మృత్యువు..

అందోల్, ఫిబ్రవరి 27: అర్థరాత్రి లారీ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ముగ్గురు యువకులను బలితీసుకుంది. సరదాగా టీ తాగేందుకు వెళ్లిన స్నేహితులు కొద్దిసేపట్లో ఇండ్లకు చేరుకుంటారనగా వారు ప్రయాణిస్తున్న కారును లారీ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని మాసాన్‌పల్లి శివారుల్లో జరిగిన ఈ ఘటనకు సంబంధించి జోగిపేట ఎస్సై అరుణ్ కుమార్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం జోగిపేటకు చెందిన మహమ్మద్ వాజిద్(27) హాజీ హుస్సేన్(25) ముకర్రం(25)తోపాటు రిజ్వాన్, శంషు, అర్షద్ టీ తాగేందుకు కారులో చౌటకూరుకు వెళ్లగా, అక్కడ దుకాణాలు మూసి ఉండడంతో మాసన్‌పల్లి శివారులోని ఓ దాబాలో టీ తాగి, తిరుగుప్రయాణంలో జోగిపేటకు వస్తూ డాకూర్-మాసాన్‌పల్లి శివారులో అండర్ బ్రిడ్జి పక్కన కారును ఆపి మూత్ర విసర్జనకు వెళ్లారు. ఇదే సమయంలో సంగారెడ్డి వైపు నుంచి